సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: కొండాపూర్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ అవుషాపూర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. అవుషాపూర్, ఎస్సీఆర్, ఆరోరా, అనురాగ్ కళాశాల, కేపాల్ ప్రాంతంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆయుష్మాన్ భారత్ యోజనలో అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



తమ పేర్లను నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారులు

మేడ్చల్: ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆయుష్మాన్ భారత్ యోజన పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డిలు అన్నారు. మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ యోజన నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5లక్షలు మంజూరీ చేస్తుందని, ఇందుకు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారంతా అర్హులని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరస్వతిరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాగరాజు, శ్రీధర్, అభిలాష్, రవిందర్‌గౌడ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన




కీసర: నాగారం మున్సిపాలిటీ 8వ వార్డు పరిధిలోని ఎస్వీనగర్‌కాలనీలో ఆదివారం కౌన్సిలర్ కొకుట్ల మమత కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి కాలనీ వాసుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు కొకుట్ల కృష్ణారెడ్డి, కాలనీ వాసులు, షాదాన్ ఆస్పత్రి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కాంగ్రెస్‌లోకి ఏవీ సత్యనారాయణ

మేడ్చల్: నియోజకవర్గ సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త ఏవీ సత్యనారాయణ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అనుచరుడిగా ఉన్న ఆయన గతంలో డీఎస్ వెంట టీఆర్‌ఎస్‌లో చేరాడు. కాగా డీఎస్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆయనతో పాటు గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పెద్దల సమక్షంలో చేయికి చేయి కలిపాడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని ఏవీ సత్యనారాయణ ఈ సందర్భంగా చెప్పాడు.

కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణలో అక్రమాలు!

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి వరకు ఉన్న రోడ్డు వెడల్పు పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి రోడ్డును గతంలో ఉన్న మ్యాప్ ఆధారంగా ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కొంపల్లి నుంచి దూలపల్లి మీదుగా బహదూర్‌పల్లి వరకు 250 అడుగుల వెడల్పుతో హైదరాబాద్- నాగపూర్ నేషనల్ హైవే 44కు అనుసంధానంగా గతంలో అధికారులు మ్యాపు రూపొందించి పనులు ప్రారంభించారు. అయితే కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితో 150 అడుగులను తగ్గించి కేవలం 100 అడుగులు మాత్రమే వేయాలని కోరడం వెనక కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఇంజినీరింగ్ కళాశాల, పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీలు, పలు కాలనీలు ఏర్పాటు కావడం మూలంగా ఇక్కడ నిత్యం రద్దీ ఏర్పడుతోందన్నారు. దీనిని గుర్తించి గతంలో అధికారులు సమగ్ర సమాచారం తీసుకొని 250 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయాలని తీర్మానం చేయగా ప్రస్తుతం దూలపల్లి గ్రామానికి చెందిన పలువురి ఒత్తిడితో 100 అడుగులు మాత్రమే వేయడం తగదని హెచ్చరించారు.. ఈ విషయంపై నేషనల్ హైవే అథారిటీ అధికారులతో పాటు ఆర్ అండ్ బి అధికారులను కలుస్తామని పేర్కొన్నారు.



ఉత్తమ పంచాయతీలకు అవార్డులు అందేదెప్పుడో?

అమాత్యులకు సమయం దొరకక అవార్డుల అందజేతలో ఆలస్యం

- అవార్డులు ఖరారైనా మంత్రి మల్లారెడ్డి బిజీ కారణంగా వాయిదా
- పురస్కారాలు అందుకునేందుకు ఎదురు చూస్తున్న 27 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు
- 9 అంశాల్లో జీపీల పనితీరుపై జిల్లా స్థాయి పురస్కారాలు
- మంత్రి చేతుల మీదుగానే అవార్డుల పంపిణీకి అధికారుల ఉబలాటం

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామీణ స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ఎన్నో వనరులను కల్పిస్తున్నాయి. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజల జీవన ప్రమాణాల మెరుగు, పేదరికం లేని గ్రామం, మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, నీరు సరిపోయే గ్రామం, క్లీన్ అండ్ గ్రీన్ (పచ్చదనం-పరిశుభ్రత), స్వయం సమృద్ధితో కూడిన గ్రామం, సామాజికంగా, న్యాయంగా సురక్షితం, మహిళా స్నేహపూర్వక గ్రామం వంటి 9 అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రామ పంచాయతీలకు పురస్కారాలు అందజేసి మరింత ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో 27 గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా పురస్కారాల (అవార్డుల)కు ఎంపిక కాగా.. వాటిని సంబంధిత గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు అందజేయటానికి అమాత్యులు సీహెచ్ మల్లారెడ్డికి సమయం దొరకకపోవడంతో.. వాయిదా పడుతూ వస్తోంది.

పదే పదే వాయిదా...

అవార్డులను శనివారం పంపిణీ చేసేందుకు మంత్రి మొదట సమయం ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం కారణంగా సోమవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. అయితే.. సోమవారం కూడా జిల్లా మంత్రి మల్లారెడ్డి అవార్డుల ప్రదాన కార్యక్రమానికి సమయం కేటాయించక పోవడంతో మళ్లీ వాయిదా వేశారు.

ఘనంగా నిర్వహించేందుకు కసరత్తు...

మంత్రి సమయాన్ని బట్టి జిల్లా స్థాయి ఉత్తమ గ్రామలుగా ఎంపికైన 27 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులను ఘనంగా అందజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలను భాగస్వామ్యం చేసేందుకు జిల్లా పంచాయతీ శాఖ కసరత్తు చేస్తోంది.

విభాగాల వారీగా.. అవార్డులకు ఎంపికైన గ్రామాలివే...

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పేదరికం లేని గ్రామం, మెరుగైన జీవనోపాధి కల్పిస్తున్న జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా మొదటి స్థానంలో లాల్‌గడ్ మలక్‌పేట్(శామీర్‌పేట), ద్వితీయ స్థానంలో అనంతారం(ఎంసీపీల్లి), తృతీయ స్థానంలో యాద్గార్‌పల్లి(కీసర)లకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు అవార్డులకు ఎంపికయ్యారు.
- ఆరోగ్యవంతమైన జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో కేశవరం (ఎంసీపీల్లి), ద్వితీయ స్థానంలో రాయల్‌పూర్ (మేడ్చల్), తృతీయ స్థానంలో తుర్కపల్లి (శామీర్‌పేట)లకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు అవార్డులకు అర్హత సాధించారు.
- చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ ఉత్తమ పంచాయతీగా ప్రథమ స్థానంలో అంకిరెడ్డిపల్లి(కీసర), ద్వితీయ స్థానంలో అవుషాపూర్ (ఘట్కేసర్), తృతీయ స్థానంలో మజీద్‌పూర్ (శామీర్‌పేట)లు ఎంపికయ్యాయి.
- నీరు సరిపోయే గ్రామంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో తిమ్మాయిపల్లి (కీసర), ద్వితీయ స్థానంలో బాబాగూడ (శామీర్‌పేట), తృతీయ స్థానంలో వెంకటాపూర్ (ఘట్కేసర్)లు ఎంపికయ్యాయి.
- క్లీన్ అండ్ గ్రీన్‌లో జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో అలియాబాద్ (శామీర్‌పేట), ద్వితీయ స్థానంలో గోధుమకుంట (కీసర), తృతీయ స్థానంలో గౌడవెల్లి (మేడ్చల్) గ్రామాలు ఎంపికయ్యాయి.
- స్వయం సమృద్ధితో కూడిన గ్రామంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో ఎంసీపల్లి (ఎంసీపల్లి), ద్వితీయ స్థానంలో మునీరాబాద్ (మేడ్చల్), తృతీయ స్థానంలో కాచవానిసింగారం (ఘట్కేసర్) గ్రామాలు ఉన్నాయి.
- సామాజిక న్యాయంగా సురక్షిత గ్రామంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీగా ప్రథమ స్థానంలో కొర్రెముల (ఘట్కేసర్), ద్వితీయ స్థానంలో మురహరిపల్లి (శామీర్‌పేట), తృతీయ స్థానంలో లక్ష్మాపూర్ (ఎంసీపల్లి) గ్రామాలు నిలిచాయి.
- గుడ్ గవర్నెన్స్‌గా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో గోధుమకుంట (కీసర), ద్వితీయ స్థానంలో యాదారం (శామీర్‌పేట), తృతీయ స్థానంలో నాగిశెట్టిపల్లి (ఎంసీపల్లి) గ్రామాలు ఉన్నాయి.
- మహిళా స్నేహపూర్వక గ్రామంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీలుగా ప్రథమ స్థానంలో శ్రీరంగవరం (మేడ్చల్), ద్వితీయ స్థానంలో పొన్నాల (శామీర్‌పేట), తృతీయ స్థానంలో ఘన్‌పూర్ (ఘట్కేసర్) గ్రామాలు నిలిచాయి. కాగా ఈ అవార్డులను ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు అందుకోనున్నారు.

మన ఓటు మనమే వేసుకోవాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న జంగయ్య

ఘట్‌కేసర్: మన ఓటు మనమే వేసుకొని బహుజన రాజ్యాధికారం దిశగా పయనించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు జంగయ్య అన్నారు. భారత్ ఇంటర్నేషనల్ మండల ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ రాసిన ఆర్టికల్ 3 ద్వారా నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ నేడు అగ్రవర్ణాల చేతిలో బందీ అయిందన్నారు. కార్యక్రమంలో దయానంద్, కృష్ణ, బాలయ్య, బద్రీ, నారాయణ, శ్రీనివాస్, సత్యం, అంజయ్య, మల్లేశ్, శ్రీరామ్, ఆనంద్, వెంకట్, సురేశ్, భరత్, సచిన్, రాజ్‌రతన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో శ్రీనివాసనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, కుషాయిగూడ శాంతివనం స్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీరెడ్డి, కొత్త రామారావు, టీపీసీసీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌కేవీ కార్మిక విభాగం అధ్యక్షుడు కుర్మన్న వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగలు, జాతీయ సెలవు దినాలను పారిశుద్ధ్య కార్మికులకు సెలవు దినాలుగా ప్రకటించాలని వినతిపత్రంలో కోరారు.

బ్రిలియంట్ టెక్నో స్కూల్ వార్షికోత్సవం



బోడుప్పల్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో జరిగిన బ్రిలియంట్ టెక్నో హైస్కూల్ 13వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. బ్రిలియంట్ టెక్నో స్కూల్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓయూ మాజీ ఉపసంచాలకుడు మసన చెన్నప్ప, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, స్కూల్ చైర్మన్ పానుగోటి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పీస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారాకు చెందిన పునరం నాయక్(35) వృత్తి రీత్యా తాపీ మేస్త్రి. ఉపాధి కోసం ఘట్‌కేసర్‌కు వలసొచ్చి కొంత కాలంగా బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా పునరం నాయక్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నోజిగూడకు చెందిన సంతోష్ అనే వ్యక్తి బోడుప్పల్ ఉన్న పునరం నాయక్ సోదరుడు గురుప్రసాద్ నాయక్‌కు సమాచారం ఇచ్చాడు. తక్షణమే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా తాడుతో సీలింగ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

కాప్రా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ జమ్మిగడ్డలో చేపట్టిన జ్ఞానమాల కార్యక్రమం 43వ వారానికి చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యతతో ముందుకు సాగితే అంబేడ్కర్ ఆశయాలను సాధించవచ్చని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్‌కుమార్, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు రహీం, దయానంద్, రవి, రాములు, కొండల్, చిన్నారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఆహ్వానం

కాప్రా: శ్రీరామనవమి సందర్భంగా గాంధీనగర్, చక్రీపురం, కుషాయిగూడలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 30న సీతా రామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రావాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డిని ఆయా కాలనీల ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో జూపల్లి శ్రీశైలం, నేమూరి మహేష్‌గౌడ్, వెంకటచారి, రాజు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

అల్వాల్: సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో అల్వాల్‌లోని హరిదాస మండపం వద్ద 72వ సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కళాక్షేత్ర నృత్యశాల వారిచే ప్రదర్శించిన సుబ్బలక్ష్మి భరత నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు కందకట్ల సుదర్శన్‌రెడ్డి, పరాంకుశం మాధవ్, గోపాల్, గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీపీఎం జన చైతన్య యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు

ఘట్‌కేసర్: సీపీఎం జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన జన చైతన్య యాత్ర అవుషాపూర్ వద్ద మండలంలో మార్చి 28న ప్రవేశిస్తుందని, అనంతరం ఈసీఐఎల్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. యాత్ర ముగింపు సందర్భంగా మార్చి 29న ఇందిరా పార్కు వద్ద జరగనున్న బహిరంగను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యాదయ్య, అశోక్, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, మండల కార్యదర్శి సబిత, నాయకులు నాగమణి, అరుణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న సందీప్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాపసింగారంలో నూతనంగా నిర్మించిన గుబ్బరిగుట్ట మైసమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సందీప్‌రెడ్డి విరాళమిచ్చాడు. ఆదివారం ఆలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి రూ.30 వేలు అందజేశాడు.

ఈ శ్రమ్-కార్డుల వివరాల నమోదు

ఘట్‌కేసర్: వెంకటాపూర్, తెనుగుగూడెం, వైభవ్ నగర్ కాలనీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ కార్డు, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారుల వివరాలు ఆదివారం నమోదు చేయించారు. ముఖ్యఅతిథిగా ఉప సర్పంచ్ కట్ట సత్యనారాయణగౌడ్ హాజరై నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో వినోద్‌ముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, శ్రీకాంత్‌ముదిరాజ్, శ్రవణ్‌ముదిరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఆత్మ రక్షణపై విద్యార్థినులకు అవగాహన



ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్న షీల్డ్ అకాడమీ ప్రతినిధులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో అనురాగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వేసవి ప్రత్యేక శిబిరం-23లో ఆత్మరక్షణపై షీల్డ్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ కావేరి హాజరై మాట్లాడుతూ.. ఎవరైన దాడి చేసినప్పుడు భయపడకుండా కళ్లు ఇతర సున్నిత భాగాలపై కొట్టాలన్నారు. షీల్డ్ అకాడమీ వ్యవస్థాపకుడు సంతోశ్ కుమార్ మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా ఎవరైన దాడికి గురి కావచ్చని, అటువంటి సందర్భాలను ఎదుర్కోవడానికి ఆత్మరక్షణలో శిక్షణ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, అనురాగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, యూనిట్-4 ఆఫీసర్ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంపీఎల్-4 టోర్నమెంట్



ఎంపీఎల్-4 విజేతలతో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మాదారం గ్రామంలో మాదారం ప్రీమియం లీగ్ సీజన్-4 (ఎంపీఎల్-4) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభాకర్, కృష్ణ, సాయి, సంతోశ్, దయాకర్, ఉపేందర్, నరేశ్, వేణు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యాకిరణ్ హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఘట్‌కేసర్: విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని విద్యాకిరణ్ హైస్కూల్ డైరెక్టర్ పుష్పలతరమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శివారెడ్డిగూడ విద్యాకిరణ్ హైస్కూల్లో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు నవీన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిద్దాం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన తటాకం రమేష్‌శర్మ తదితరులు

కీసర: ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తెలిపారు. మహనీయులకు జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా కీసర చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు మొర్గు రవీందర్, తటాకం రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

మల్లాపూర్: దేశాన్ని 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, తొమ్మిదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ వల్ల దేశం అధోగతి పాలైందని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నాచారం ఏఎన్‌ఆర్ గార్డెన్స్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, తొమ్మిదేళ్లలోనే గణనీయమైన అభివృద్ధి సాధించామన్నారు. కేసీఆర్‌ను దెబ్బ తీసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఎమ్మెల్సీ కవితను వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మేడ్చల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలీయమైన శక్తిగా మార్చాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్‌శేఖర్, పన్నాల దేవేందర్ రెడ్డి, జెరిపోతుల ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.